ఎంపీఐల బదిలీ

తిమ్మాపూర్, జనవరి 10: రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖలో ఆన్ డ్యూటీ(ఓడీ)లు, అదనపు బాధ్యతలు, ఇన్‌చార్జిలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో పలువురు ఎంవీఐలు బదిలీ అయ్యారు. జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న గౌస్ పాషాను ఖమ్మం జిల్లాకు, మసూద్ అలీ, సిరాజుర్ రహ్మాన్‌ను పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఖమ్మంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్, హుస్నాబాద్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఠాకూర్ ఈశ్వర్ సింగ్‌ను కరీంనగర్ ఎంవీఐగా బదిలీ చేసినట్లు డీటీసీ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు.

బాలికల భవిష్యత్తుకు విద్యార్థి దశ నుంచే పునాది వేయాలి

తిమ్మాపూర్, జనవరి 10: విద్యార్థి దశ నుంచే బాలికల భవిష్యత్తుకు పునాది వేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో స్నేహిత కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బాలిక సాధికారత దిశగా జిల్లాలో స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.



తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

విద్యార్థులు ఇంటర్నెట్ సౌకర్యాన్ని మంచి పనులకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఆడపిల్లలు ఏ సమస్య ఉన్నా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ధైర్యంగా చెప్పాలన్నారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్లు, షీ టీంలు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థినులు అపరిచితులతో ఇంటర్నెట్‌లో పరిచయాలు పెంచుకొని తమ జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. చదువుల పైనే ధ్యాస పెట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పులు చేస్తుంటారని, వాటిని అధిగమించి తప్పులను సరి చేసుకుని ముందుకు సాగాలని తెలిపారు. గమ్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా చదువు కొనసాగించా లన్నారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ జిల్లా అధికారులు, ఉపాధ్యాయులతో బాలికా సాధికారత కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం జిల్లాలోని రెండు పాఠశాలల్లో స్నేహిత కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. తిమ్మాపూర్ సర్పంచ్ దుండ్ర నీలమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, డీఎంహెచ్‌వో లలితా దేవి, కరీంనగర్ రూరల్ సీడీపీవో సబితా కుమారి, డీసీపీవో శాంత, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మ పాల్గొన్నారు.

● బాల్య వివాహలకు అడ్డుకట్ట వేయాలి.

మానకొండూర్: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ సూచించారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ, పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం స్నేహిత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. పోషకాహారం తీసుకొని ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎం అరుణ, శ్రీలత, వైద్యుడు గోపాల్ పాల్గొన్నారు.



మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్‌లో విద్యార్థినులతో కలిసి కూర్చున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

రైస్ మిల్లర్లు యాసంగి లక్ష్యాలను పూర్తి చేయాలి

కలెక్టర్ పమేలా సత్పతి



అలుగునూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



రైస్ మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్

తిమ్మాపూర్, జనవరి 10: రైస్ మిల్లర్లకు ప్రభుత్వం నిర్దేశించిన యాసంగి లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర రైస్ మిల్లును కలెక్టర్ పమేలా సత్పతి ఆకస్మింగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో ఎంత ఉత్పత్తి చేస్తున్నరని, సీఎంఆర్ ఏమైనా పెండింగ్‌లో ఉందా అని నిర్వహకులను ప్రశ్నించారు. రైస్‌మిల్లులో ఉన్న బాయిల్డ్ రైస్, ఫోర్టిఫైడ్ రైస్ నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు.

● మిల్లును శుభ్రంగా ఉంచాలి

రైస్ మిల్లులో ఉన్న బూజును చూసి మిల్లును ఇలాగే ఉంచుతారా అని నిర్వహకులను కలెక్టర్ ప్రశ్నించారు. ఎప్పటికపుడు శుభ్రం చేస్తుండాలని, శుభ్రంగా లేకపోతే మిల్లులో పని చేసే వారికి శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశ ఉందన్నారు. బూజులు తీయించి శుభ్రం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి, డీటీ వేణు, డీఎం రజినీకాంత్, తహసీల్దార్ కనకయ్య, రైస్ మిల్లు నిర్వహకుడు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

● అలుగునూర్ నర్సరీ పరిశీలన

అలుగునూర్ నర్సరీని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు చాలా బాగున్నా యన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ కనకయ్య, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.



పొలంలోకి దిగి.. నాటు వేసి..

ఏంటీ.. విద్యార్థినులు పొలంలోకి దిగి వరి నాటు వేస్తున్నారు అనుకుంటున్నారా.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో వృత్తి విద్యా (వొకేషనల్) కోర్సులను నిర్వహిస్తోంది. సైదాపూర్ మోడల్ స్కూల్‌లో అగ్రికల్చర్ కోర్సు తీసుకున్న విద్యార్థినులు సోమారం శివారులోని పొలాల్లోకి క్షేత్ర స్థాయి పర్యటనకు బుధవారం వెళ్లారు. వారికి ఉపాధ్యాయులు పొలాన్ని చదును చేయడం, వరి నాటు వేయడం, ఎరువుల వాడకం గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులు పొలంలోకి దిగి ఇలా ఉత్సాహంగా నాటు వేశారు.

◆ సైదాపూర్



కోడి.. కోడి.. నీ ఊరేది..

అనగనగా ఓ కోడి.. దానిని ఎవరు తెచ్చారో కాని వరంగల్ నుంచి వేములవాడకు వెళ్లే ఓ ఆర్టీసీ బస్సులో ఓ సంచిలో పెట్టి మరిచిపోయారు.. బస్సు కరీంనగర్‌కు వచ్చిన తర్వాత గమనించిన ప్రయాణికులు కండక్టర్‌కు తెలిపారు. కండక్టర్ ఆ కోడిని కంట్రోలర్‌కు అప్పగించి వెళ్లిపోయాడు. ఆయన ఎవరైనా వస్తారేమోనని సాయంత్రం వరకు చూసి కరీంనగర్-2 డిపో సిబ్బందికి అప్పగించారు. వాళ్లు కోడి కోసం ఓ జాలిని ఏర్పాటు చేసి దాణా తెప్పించి పెట్టారు. ఓ గిన్నెలో నీళ్ల ఏర్పాటు చేశారు. కోడి కోసం ఎవరూ రాకపోతే ఎన్ని రోజులు దాని ఆలనాపాలనా చూడాల్సి వస్తుందో అని అంటున్నారు.

◆ భగత్‌నగర్

ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజాపాలన కొనసాగిస్తాం

దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నాం..మంత్రి పొన్నం ప్రభాకర్



కొండపల్కలలో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్, జనవరి 10: ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజాపాలన కొనసాగిస్తామని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని గంగిపల్లి, కొండపల్కల, నిజాయితీగూడెం గ్రామాల్లో బుధవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కొండపల్కల గ్రామంలో ఆర్టీసీ బస్సును ప్రారంభించి గంగిపల్లి వరకు ప్రయాణించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని అన్నారు. రెండు గ్యారెంటీలను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. మిగతా నాలుగు గ్యారెంటీల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.05 కోట్ల దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్ చేసేందుకు 45 వేల మందిని నియమించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. తిమ్మాపూర్‌లోని డ్రైవింగ్ స్కూల్ ట్రాక్‌కు మాజీ ఎంపీ చొక్కారావు పేరు పెడుతూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా పరిపాలన అందించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, డీఈవో జనార్దన్‌రావు, ఎంపీపీ ముద్దసాని సులోచన, సర్పంచులు నల్ల వంశీధర్‌రెడ్డి, మాశం శాలిని, బోళ్ల మురళీధర్, ఎంపీటీసీలు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, చలిగంటి సంపత్, తాల్లపల్లి సంపత్, డీఆర్డీవో శ్రీలత, జడ్పీ సీఈవో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పుష్యమాసం

● ఫిబ్రవరి 10 వరకు ముహూర్తాల్లేవు..

కరీంనగర్ కల్చరల్, జనవరి 10: మార్గశిర మాసం ముగిసి శూన్యమాసంగా చెప్పుకునే పుష్యమాసం శుక్రవారం నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 10వ తేదీ వరకు కొనసాగనుంది. చంద్రుడు పుష్యమీ నక్షత్రంలో ఉండగా వచ్చే ఈ మాసం వేదాధ్యయనానికి అనుకూలమైంది. శనికి పరమ ప్రీతికర మాసం కూడా. ఈ మాసంలో శనికి ప్రత్యేక పూజలు, నువ్వులు, బెల్లం దానం ఇవ్వడం మంచిదని పండితులు చెబుతారు. వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఒంట్లో వేడిమి పెంచి చలి నుంచి రక్షణ దొరుకుతుందని ఆయుర్వేదం చెబుతుంది. ఈ మాసంలో విష్ణువును, శివుడిని, పితృ దేవతలను పూజించడం, నదీ స్నానాలాచరించడం ద్వారా సకల శుభాలు పొందవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ మాసంలో సంక్రాంతి పండుగ, గోదారంగనాథ కల్యాణాలు జరుపుకుంటారు. పుష్యమాసం వస్తుండటంతో ఫిబ్రవరి 10 వరకు ముహూర్తాలు లేవని, తిరిగి మాఘ, ఫాల్గుణ మాసాల్లో అంటే ఫిబ్రవరి, మార్చి మాసాల్లో విరివిగా శుభ ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే ముహూర్తాలు పెట్టుకున్నవారు డిసెంబరు నెలలోనే వివాహాది శుభకార్యాల కోసం ఫంక్షన్‌హాళ్లు, తదితర బుకింగ్‌లు పూర్తి చేసుకున్నారు. జనవరిలో బుకింగ్ చేసుకునేందుకు జనం సిద్ధమవుతున్నారు.

విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

గణేశ్‌నగర్, జనవరి 10: విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో మై భారత్ వికసిత భారత్ 2047 అనే అంశంపై జిల్లాస్థాయి ఉపాన్యాస పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో ఈషా పార్వేజ్, ద్వితీయ స్థానంలో టి శివశంకరసాయి, తృతీయ స్థానంలో టి రోషిణి నిలిచారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం అధికారి బి రవీందర్, డాక్టర్ కె శారద, డీడీ నాయుడు, పి రాజు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

కరీంనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో యూరియా 21,706 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4972, కాంప్లెక్స్ ఎరువులు 29,653, మ్యురేట్ ఆఫ్ పొటాష్ 4,593 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగంలో ఎరువుల సరఫరా, నిల్వలు, పంపిణీ, అమ్మకాల నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. ఎరువులకు సంబంధించి మండలాల్లో వ్యవసాయాధికారులు క్వాలిటీ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరిస్తారన్నారు. ప్రతి డీలర్లు, రిటైలర్లు కంపెనీల నుంచి వారి అనుమతుల ప్రకారం ఎరువులు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఎరువు బస్తాపై సబ్సిడీ భరిస్తున్నందున ఈ-పాస్ మిషన్ (ఆన్‌లైన్ వ్యవస్థ) ద్వారా మాత్రమే కొనుగోళ్లు, అమ్మకాలు చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో అమ్మకాల్లో జాప్యం లేకుండా ఫైన్స్ ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం అనే ఇంటర్ఫేస్‌ను క్రాప్ బుకింగ్ (పంటలనమోదు) యాప్‌లో నమోదు చేయడం ప్రారంభించామన్నారు. ఇందులో బాగంగా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సంచాలకులు వారంలో ఇరవై రిటైల్ షాపులు తనిఖీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. తాను వారానికి పది హోల్‌సేల్ షాపులు తనిఖీ చేస్తానన్నారు. కంపెనీ, హోల్‌సేల్ డీలర్ నుంచి వచ్చిన ఎరువులను ఈ-పాస్‌లో ఆమోదించాల్సి ఉంటుందని తెలిపారు. ధ్రువీకరించిన తరువాతనే ఎరువులను ఈ-పాస్‌ల ద్వారా అమ్మడానికి వీలవుతుందని చెప్పారు. రైతులకు సంబంధించిన భూమి సాగు విస్తీర్ణం ఆధార్‌తో అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. ధ్రువీకరించిన రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. ఈ పద్ధతి ద్వారా కొనుగోలు, అమ్మకాల వ్యవస్థ సెంట్రల్ స్థాయి వరకు అనుసంధానమై ఉంటుందని తెలిపారు.



ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

నగర అభివృద్ధే ధ్యేయం

మేయర్ వై సునీల్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర మేయర్ వై సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 10: నగర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తోందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం ఆయన నగరంలోని 35వ డివిజన్‌లో పర్యటించారు. సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని తెలిపారు. నగరవ్యాప్తంగా ఎక్కడ చూసినా సీసీ రోడ్లు, చక్కటి డ్రైనేజీలను ఏర్పాటు చేసి ప్రజలకు కావాల్సిన వసతులు, సౌకర్యాలు కల్పించామని తెలిపారు. నగరంలో ప్రధాన రహదారులను అందంగా తీర్చిదిద్ది, అన్ని జంక్షన్లను సుందరీకరించామన్నారు. రాబోయే రోజుల్లో నగరంలో మిగిలి పోయిన రోడ్లు, డ్రైనేజీలు, జంక్షన్లను కూడా పూర్తి చేసి నగరాన్ని మరింత సుందర నగరంగా మార్చుతామని తెలిపారు. నగరంలో ప్రభుత్వ పాఠశాలలను 10 కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, డివిజన్‌వాసులు పాల్గొన్నారు.

బాలుడిని పనిలో పెట్టుకున్న వ్యాపారిపై కేసు

గంగాధర, జనవరి 10: బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు గంగాధరలో ఓ వ్యాపారిపై బుధవారం జువైనల్ యాక్ట్ కేసు నమోదైంది. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ప్రత్యేక బృందం గంగాధరలో తనిఖీలు చేపట్టింది. కిరాణ దుకాణంలో పనిచేసున్న 14 సంవత్సరాల బాలుడిని అధికారులు గుర్తించారు. బృందంలో సభ్యుడైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు జువనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం 374ఐపీసీ ప్రకారం దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అనంతరం బాలుడిని జిల్లాలోని బాలల సమితి ముందు ప్రవేశపెట్టి బాలుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిసింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పెగడపల్లి, జనవరి 10: గంజాయి రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సీహెచ్. సతీష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం గంజాయి సరఫరా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పెగడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మల్యాల సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో పెగడపల్లి ఎస్ఐ సతీష్ పోలీస్ సిబ్బందితో కాపుకాసారు. అనుమానాస్పదంగా కనిపిం చిన వ్యక్తి వద్ద హ్యాండ్ బ్యాగ్ తనిఖీ చేయగా అందులో 1.720 కిలోలు గంజాయి లభించింది. దాని విలువ దాదాపు రూ.35 వేలు ఉంటుందని పోలీ సులు తెలిపారు. గంజాయి తరలిస్తున్న రాచర్ల వంశీ (22) వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కోటేశ్వర్ తెలిపారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 10: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన అప్పాల మహేష్‌పై అదనపు వరకట్నం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేం దర్ తెలిపారు. బుధవారం మహేష్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు భర్త మహేష్‌తో పాటు అత్త దేవలక్ష్మీ, మామ శంకరయ్య, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వివాహమై 5 సంవత్సరాలు గడిచినప్పటికీ అదనంగా రూ.5 లక్షలు వరకట్నం తేవాలని మానసికంగా వేధించడంతో గృహహింస కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, జనవరి 10: సిరిసిల్ల పట్టణంలోని ఓ రైస్‌మిల్లులో క్వింటాల్ రేషన్ బియ్యం విక్రయించేందుకు వస్తున్న వేములవాడకు చెందిన బి రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. వేములవాడలో సేకరించిన క్వింటాల్ రేషన్ బియ్యాన్ని టీవీఎస్ చాంప్‌పై తీసుకవస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ధర్మపురి, జనవరి 10: ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామంలో అనుపురం లక్ష్మి(66) అనే వృద్ధురాలు బుధవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఉదయం కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకగా తన వ్యవసాయ బావిలో శవమై తేలింది. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి శవాన్ని బయటకు తీయించారు. మృతురాలి కొడుకు తిరుపతి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ దత్తాత్రి ఆధ్వర్యంలో హెచ్‌సీ ఎండీ సలీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు షేర్ చేసిన వ్యక్తి రిమాండ్

వేములవాడ రూరల్, జనవరి 10: చైల్డ్ పోర్న్ వీడియోస్ షేర్ చేసిన వ్యక్తిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన మల్యాల అరవింద్ చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి సోషల్ మీడియా ద్వారా ఇతరులకి షేర్ చేస్తున్నాడని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీస్ నుంచి సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎస్సై మారుతి మంగళవారం సాయంత్రం చెక్కపల్లి శివారులోని పెద్దమ్మతల్లి గుడి వద్దకు వెళ్లగా అరవింద్ పారిపోవడానికి ప్రయత్నించాడని, వెంటనే పట్టుకొని అతడి ఫోన్ పరిశీలించగా అశ్లీల చిత్రాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అరెస్టు చేసి విచారించగా అశ్లీల చిత్రాలను డౌన్ లోడ్ చేసి ఇతరులకు షేర్ చేసి డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిపాడన్నారు. దీంతో కేసు నమోదు చేసి రూరల్ సీఐ కృష్ణకుమార్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైల్డ్ పోర్న్ వీడియోస్ చూసినా, డౌన్‌లోడ్ చేసినా కఠిన చర్యలుంటాయని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి వారిపై సైబర్ సెక్యూరిటీ పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని పేర్కొన్నారు.

తోట నిర్మలారాణికి అలిశెట్టి పురస్కారం


తోట నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జనవరి 10: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అందించే అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారాన్ని 2024 సంవత్సరానికి కరీంనగర్ కాపువాడకు చెందిన రచయిత్రి తోట నిర్మలారాణికి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఫిలింభవన్‌లో అందజేయనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవి, విమర్శకుడు సీతారాం, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వేంకటేశ్వర్లు తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

రాజన్నకు భక్తుల మొక్కులు

వేములవాడ టౌన్, జనవరి 10: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సాధరణ రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించారు. అనంతరం ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి రాజన్నను దర్శించకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన మల్లికార్జున స్వామి జాతర

గొల్లపల్లి, జనవరి 10: మండలంలోని మల్లన్నపేట గ్రామంలో ఏడు వారాలుగా జరుగుతున్న శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి తమ ఇష్ట దైవానికి బోనాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరు రాజేందర్ శర్మ, కొండూరు రఘునందన్ శర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ మల్లిఖార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సర్పంచ్ సిద్ధంకి నర్సయ్య, ఎంపీటీసీ గోస్కుల రాజన్న, ఉప సర్పంచ్ జేర కిషోర్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ కొండూరు శాంతయ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల జడ్పీ సీఈవో రఘువరన్ జాతర చివరి రోజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కన్నుల పండువగా వీరభద్రస్వామి కల్యాణం

తలంబ్రాలు తీసుకువచ్చిన మంత్రి పొన్నం దంపతులు


కొత్తకొండలో శ్రీవీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భీమదేవరపల్లి, జనవరి 10: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి కల్యాణం.. కమనీయం..రమణీయంగా వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య బుధవారం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా పల్లకిలో తీసుకువచ్చారు. స్వామివారి పుష్కరిణి పక్కన గల కల్యాణ మండపంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి కొత్తకొండ, ముస్తాఫాపూర్, ధర్మారం, చంటయ్యపల్లి, గొల్లపల్లి, గట్లనర్సింగాపూర్, తదితర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. ఆలయ ఈవో కిషన్‌రావు కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ మేరకు స్వామివారి కల్యాణానికి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాలన్ని కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మంజులారెడ్డి, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీలు వంగ రవి, మాజీ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, ఆర్ వెంకట్‌రెడ్డి, పిడిశెట్టి కనుకయ్య, కాసం రమేష్‌గుప్తా, సర్పంచ్‌లు దూడల ప్రమీల-సంపత్, రొంటాల ప్రభాకర్, గుంటి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

గణేశ్‌నగర్, జనవరి 10: శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 8మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. సెమిస్టర్-1లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, శ్రీశివాని డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంబీరావుపేటలో-4, అపూర్వ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-1, మూడో సెమిస్టర్‌లో శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ రిమాండ్

కోనరావుపేట, జనవరి 10: నకిలీ గల్ఫ్ ఏజెంట్‌గా చలామణి అవుతూ ఓ ఇద్దరి వ్యక్తులను గల్ఫ్ దేశం పంపిస్తానని మోసం చేసిన నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్టు చేసి బుధవారం రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలోని బాలాజీ ట్రావెల్స్ యజమాని ధరావత్ విట్టల్, నిమ్మపల్లి గ్రామానికి చెందిన విక్కుతి రాజు, దొంతరవేణి మహేష్‌లను గల్ఫ్‌దేశం పంపిస్తానని చెరో లక్ష రూపాయలు తీసుకొని నకిలీ వీసా ఇచ్చి మోసం చేయడంతో అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు.

డీ8 ఉపకాలువకు మరమ్మతు పనులు

గన్నేరువరం, జనవరి 10: మండలంలోని ఖాసింపేట నుంచి మాదాపూర్‌కు వెళ్లే డీ8 ఉపకాలువలో పిచ్చి మొక్కలు, మట్టి కూరుకుపోవడంతో గత సంవత్సరం నుంచి రైతులకు నీరందక ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం కెనాల్‌లోని చెట్లు, మట్టిని తొలగించే పనుల ప్రారంభించారు. ఎంపిపి లింగాల మల్లారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రవిందర్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రమేష్‌బాబు పౌరసత్వం కేసు విచారణ వాయిదా

వేములవాడ టౌన్, జనవరి 10 : తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో వేములవాడ మాజీ శాసనసభ్యుడు చెన్నమనేని రమేష్‌బాబు కేసు బుధవారం విచారణ జరిగింది. ఈ మేరకు సుదీర్ఘ వాదనల అనంతరం రమేష్‌బాబు తరపు న్యాయవాదులను పూర్తి వివరాలతో రావాలని, కేసును తిరిగి శుక్రవారం వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపిందని ఆది శ్రీనివాస్ తరుపు న్యాయవాదులు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో ఆరుగురి అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్

అంతర్గాం, జనవరి 10: విధుల్లో ఉన్న రైల్వే ఉద్యోగిని బెదిరించి రైల్వే ఆస్తిని దొంగిలించిన కేసులో ఆరుగురిని బుధవారం అరెస్టు చేసినట్టు రామగుండం రైల్వే ప్రొటక్షన్స్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. డిసెంబరు 14న అంతర్గాం మండల పరిధిలోని విలేజి అంతర్గాం శివారు గోదావరి రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం పవన్ కుమార్‌ను మంచిర్యాలకు చెందిన కడమంచి మహేష్, కడమంచి శ్రీను, చింతల శేఖర్, వనరాశి మల్లేష్, ఇగ్గన నగేష్, వనరాశి ఉప్పలయ్య బెదిరించి మెటీరియల్‌ను దొంగిలించారు. నిందితులను అదుపులోకి తీసుకుని దొంగిలించబడిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ పేర్కొన్నారు. రైల్వే ఆస్తులను దొంగిలించినా, ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఐలయ్య, సుమన్, ఓంవీర్ పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

● రూ, 12,380ల మద్యం సీజ్ ● కేసు నమోదు

సైదాపూర్, జనవరి 10: సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, రాయికల్ గ్రామాల్లో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.12,380ల మద్యం సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం వెన్నంపల్లి, రాయికల్‌లో పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. వెన్నంపల్లి గ్రామానికి చెందిన తోట రవి బెల్టు షాపులో రూ. 2580, రాయికల్ గ్రామానికి చెందిన బత్తిని రాజయ్య బెల్టు షాపులో రూ. 9,800ల మద్యం పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జన్ను ఆరోగ్యం హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 10: ఎల్లారెడ్డిపేట మండల శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదంలో గంభీరావుపేటకు చెందిన యువకుడు కిషోర్‌తో పాటు మరో యువకుడు కుల్‌దీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కిషోర్, కుల్‌దీప్‌కుమార్ బైక్‌పై పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుల్‌దీప్‌కుమార్ పరిస్థితి విషమంగా మారడంతో సిరిసిల్లకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ చెట్టుకు ఢీకొని డ్రైవర్ మృతి

మానకొండూర్, జనవరి 10: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో బుధవారం చెట్టుకు ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్ మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపల్లికి చెందిన నందగిరి సాయినంద్ (26) అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జగ్గయ్యపల్లి నుంచి కూలీలతో ట్రాక్టర్‌లో శ్రీనివాస్‌నగర్ గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఓ వాహనాన్ని తప్పించబోయి పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయినంద్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరి తిరుమల ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు వేదికలో ప్రైవేట్ కంపెనీ కార్యక్రమం

శంకరపట్నం, జనవరి 10: శంకరపట్నం మండలం కన్నాపూర్ క్లస్టర్ రైతు వేదికలో ఓ ప్రైవేట్ పెస్టిసైడ్ కంపెనీ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ రైతు వేదికలో ప్రైవేట్ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని కొంత మంది స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రైవేట్ కంపెనీ బుధవారం రైతు వేదికలో పెస్టిసైడ్స్ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించడానికి స్థానికంగా ఉండే రైతులను పెద్ద సంఖ్యలో పోగు చేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా తన అనుమతి లేకుండానే కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు.

ప్రకృతి వనం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ఇల్లందకుంట, జనవరి 10: మండలంలోని ఎర్రగట్టు గుట్ట సమీపంలోని బోగంపాడు, సిరిసేడు గ్రామాల ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ధ్వంసం చేసిన ప్రకృతి వనాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదనే అనుమానం వస్తోందన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు చోద్యం చేస్తూ వారికి సంబంధం లేనట్టుగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో అజ్గర్, బోగం శ్యామ్, మురహరి నరేందర్, రేణుకుంట్ల సారయ్య, మర్రి సాయి, రేణుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ పూరి గుడిసె దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 10: మండలంలోని తారుపల్లి గ్రామానికి చెందిన దోబుల మొగిలికి చెందిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు నిప్పంటుకుని బుధవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో విలువైన సామగ్రితో పాటు టేకు దుంగలు, రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయి. గుడిసెలో ఉన్న గేదె, గేదె పిల్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు ఇంటి యజమాని మొగిలి తెలిపారు. సంఘటన స్థలాన్ని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఆర్ఐ నర్సింగం పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గుడిసెలో ఉన్న విలువైన వస్తువులతో పాటు రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయని, ప్రమాదం జరిగినప్పుడు గుడిసెలో ఉన్న గేదెలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, నకినపల్లి స్వామి, దోబుల మోహన్‌రావు, దోబుల మల్లయ్య, అంజన్న పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జనవరి 10 : కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న బత్తిని శ్రీకాంత్(25) అనే యువకుడు కడుపునొప్పి భర్చిలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కొత్తపల్లి ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ భార్య, పిల్లలతో సహా గత కొద్ది రోజులుగా సీతారాంపూర్‌లో ఉంటూ ఒక గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల నుంచి అతను కడుపునొప్పితో బాధపడుతూ ఆర్‌ఎంపీ వద్ద గోళీలు తెచ్చుకుని వాడకుంటుండేవాడని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం ఉదయం 9 గంటలకు కడుపునొప్పి వస్తుందని పడుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లి కొద్దిసేపటికి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడని, వెంటనే భార్య, తల్లిలు కలిసి ఉరినుంచి శ్రీకాంత్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జనవరి 10 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు బుధవారం ఉదయం 4:30 గంటలకు మానేరు బైపాస్ రోడ్‌లో ఇసక ట్రాక్టర్‌ను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ శివరాత్రి కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే కట్టరాంపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఇసుక ట్రాక్టర్‌ను బ్లూకోల్ట్స్ పోలీసులు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ లోకిని రమేష్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, జనవరి 10: రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల్లో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన నాయకులకే కాకుండా అన్ని జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో పనిచేసిన ఉద్యమకారులను గుర్తించి ప్రాధాన్యం ఇవ్వాలని టీజేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లుగా నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని, ప్రజల పక్షాన ఉద్యమించిన వారిని గుర్తించాలని కోరారు.

కొండగట్టు హుండీ లెక్కింపులో చేతివాటం

● రూ. 11,010 అపహరణ ● నిందితుడిని పోలీసులకు అప్పగించిన దేవస్థానం అధికారులు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జనవరి 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కింపు చేపట్టగా ఆలయ ప్రసాదాల తయారీలో పని చేసే తాత్కాలిక ఉద్యోగి ఒకరు నగదు దొంగిలించాడు. లెక్కింపు సందర్భంగా ఆలయంలోని హుండీలను విప్పి సంచులతో అందులోని డబ్బులను తీసుకువచ్చి ప్రాకార మండపంలో లెక్కింపు చేస్తుంటారు. అయితే లెక్కింపునకు ముందు నాణేలను, నగదును వేరు చేస్తారు. వేరు చేసే క్రమంలో ప్రసాదాల తయారీ సిబ్బంది కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన కొలగాని రవి అనే సిబ్బంది రూ.500నోట్లు 11తో పాటు రూ. 10 అందులో నుంచి తీసి దాచుకోవడంతో అక్కడ లెక్కింపునకు వచ్చిన భక్తుడు ఒకరు చూసి అధికారులకు సమాచారం అందించాడు. దీంతో అక్కడే గల ఉమ్మడి కరీంనగర్ దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్ వెంటనే అతన్ని అక్కడి ఏఎస్సై చిలుక శ్రీనివాస్‌తో పాటు పోలీసులకు అప్పగించి నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈవో ఫిర్యాదు మేరకు పోలీసులు రవిపై కేసు నమోదు చేశారు.

● పర్యవేక్షణ అంతంత మాత్రమే

భక్తులు సమర్పించే డబ్బులు, బంగారు, వెండి కానుకల లెక్కింపు, తూకంపై ఏళ్లుగా ఆరోపణలు ఉన్నాయి. లెక్కింపు సమయంలో సిబ్బంది చేతివాటంకు పాల్పడిన సంఘటనలు ఉండగా కౌంటింగ్ ప్రక్రియపై తరచూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. హుండీల కౌంటింగ్ సందర్భంగా దేవస్థానం అధికారులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో దేవస్థానం అధికారులు, పోలీసుల సమక్షంలో కౌంటింగ్ చేపడుతుంటారు. పర్యవేక్షణ పకడ్బందీగా లేక తరచూ దొంగతనాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. గతంలో హుండీ లెక్కింపు సమయంలో చోరీ ఘటనలు జరిగినా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

హుండీ ఆదాయం రూ.71.73 లక్షలు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. 35 రోజులకు హుండీల ద్వారా రూ.71,73,723 నగదు దేవస్థానంకు సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 51 గ్రాముల మిశ్రమ బంగారం, 3.200కిలోల మిశ్రమ వెండి, 30 విదేశి కరెన్సీ లభించినట్లు ఈఓ పి.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు



అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

బదిలీపై వెళ్లిన ఎంవీఐకి సన్మానం


ఎంవీఐని సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్, జనవరి 10: హుజూరాబాద్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిరాజ్ ఉర్ రహ్మాన్ పెద్దపల్లికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం లారీ అసోసియేషన్ సభ్యులు, వాహనదారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా సిరాజ్ ఉర్‌రహ్మాన్ హుజూరాబాద్ ఎంవీఐగా పనిచేసి ప్రజల మన్ననలను పొందారన్నారు. దళితబంధు వాహన యూనిట్ల రిజిస్ట్రేషన్లలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎండీ సలీం, తిరుపతి, మజీత్, అహ్మద్, రషీద్, రమేష్, రాంప్రసాద్, మోహన్‌బాయి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

జమ్మికుంట, జనవరి 10: పట్టణంలోని న్యూ మిలీనియం ప్లేస్కూల్, స్వామి వివేకనంద పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిదాసు, గోదాదేవి వేషాధారణలో వచ్చిన విద్యార్థులు అందరిని ఆకట్టుకున్నారు. విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

మంత్రి జూపల్లిని కలిసిన తుమ్మేటి సమ్మిరెడ్డి

జమ్మికుంట, జనవరి 10: జమ్మికుంట మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హైదరాబాద్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మంత్రితో మాట్లాడారు. బెల్ట్ షాపులను నియంత్రించడం సంతోషంగా ఉందన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్‌ను రద్దు చేయాలి

శంకరపట్నం, జనవరి 10: ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్‌ను రద్దు చేయాలని శంకరపట్నం మండలం తాడికల్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో కేతిరి వెంకటనర్సింహారెడ్డికి, ఎంఎన్‌వో లక్ష్మీనారాయణ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణుకుమార్‌లకు ఉపాధ్యాయులు బుధవారం వినతిపత్రం అందజేశారు.

టీఎన్జీవోస్ కార్యవర్గం ఏన్నిక

తిమ్మాపూర్, జనవరి10: తిమ్మాపూర్, గన్నేరువరం టీఎన్జీవోస్ యూనిట్ 2024-27కు కార్యవర్గన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా పోలు కిషన్, కార్యదర్శిగా అంబటి నాగరాజు, కోశాధికారిగా పుప్పాల అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.రాజయ్య, డి.ధనలక్ష్మి, వి.వెంకటరెడ్డి, బి.రాజ్ కుమార్, యం. యుగంధర్ రెడ్డి, ఎన్.రవీందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీనివాస్, శశంక్, పి.లక్ష్మణ్, రాజ్ కుమార్, ఎస్.రాజ్ కుమార్, కార్యనిర్వహక కార్యదర్శులుగా ఏ.లచ్చయ్య, బి.శ్రీనివాస్, సరస్వతి, సంతోష్, ప్రచార కార్యదర్శిగా పవిత్ర, కార్యవర్గ సభ్యులుగా లావణ్య, శ్వేత, కుమార స్వామి, శ్రీనివాస్, రమేష్, మహేందర్, రవీంద్ర స్వామి, మతీన్, నాగరాజు, రాజమల్లు ఎన్నికయ్యారు.

● రేణికుంట గ్రామంలో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మేడిపల్లి పరామర్శ

చొప్పదండి, జనవరి 10: మండలంలోని రుక్మాపూర్, కొలిమికుంట, చొప్పదండిలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం పరామర్శించారు. రుక్మాపూర్‌లో గన్‌మెన్ కర్రె రాజుతండ్రి మృతిచెందగా పరామర్శించారు. చొప్పదండిలో ఎల్లారెడ్డిని, గంధం సుమన్‌ను పరామర్శించారు.

ట్రస్మా కార్యవర్గం ఎన్నిక

రామడుగు:మండల కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలో బుధవారం తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజర్ అసోసియేట్ కార్యవర్గాన్ని రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్మా మండల అధ్యక్షుడు పంజాల జగన్మోహన్ గౌడ్, జనరల్ సెక్రటరీగా మినుకుల మునీందర్, ట్రెజరర్‌గా తోట కిరణ్ ఎన్నికయ్యారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

గన్నేరువరం, జనవరి 10: మండలంలోని గన్నేరువరం, హన్మాజిపల్లి, ఖాసింపేట, గుండ్లపల్లి గ్రామాలో పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి బుధవారం తనిఖీ చేపట్టారు. రికార్డులు పరిశీలన, కల్తీ ఎరువుల నియంత్రణ వంటి చర్యలు తీసుకునేందుకు తనఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 10: నగరంలోని వావిలాలపల్లి, అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్, మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్, రేకుర్తిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్ పాఠశాలల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను అల్ఫోర్స్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వాతావరణం ఉట్టి పడే విధంగా మకర సంక్రాంతి, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు ముగ్గుల పోటీల్లో పాలుపంచుకున్నారు. ముగ్గులు వేసిన మహిళలకు బహుమతులు అందించారు.

●స్థానిక మంకమ్మతోట, విద్యానగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

●నగరంలోని ముకరంపుర వాణీనికేతన్ విద్యాసంస్థలో ముందస్తు సంక్రాంతి వేడుకలను విద్యాసంస్థల ఛైర్మన్ విజయాఅయోధ్యరామారావు ప్రారంభించారు. డైరెక్టర్ రేణుక పండుగ విశిష్ఠతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ప్రశాంత్, కిడ్స్ కేర్ ఇన్‌చార్జి జేసస్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, నీలకంఠం పాల్గొన్నారు.


సిద్ధార్థలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు


వాణినికేతన్ పాఠశాలలో..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 10: నగరంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల సబ్‌స్టేషన్ కొత్త లేబర్ అడ్డా, జ్యోతినగర్, భాగ్యనగర్, విద్యానగర్, సంతోష్‌నగర్, ఆదిత్యనగర్, కోత్తయస్వాడ, ఆర్టీసీ వర్క్‌షాప్ వెనుక వైపు, విజయ దుర్గాకాలనీ 11/ కెవి సాయికృష్ణ, ఫీడర్ పరిధిలో, భగత్‌నగర్ ఏరియా, ముకారాంపురం ఏరియా, గీత భవన్ నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు పోలీస్ హెడ్ కోటర్స్ ఏరియా, కలెక్టరేట్ కాంప్లెక్స్ ఆపోజిట్, ఎలక్ట్రికల్ ఛార్జింగ్ స్టేషన్ (బస్టాండ్), ఐబీ చౌరస్తా, గీతాభవన్ చౌరస్తా, యాక్సిస్ బ్యాంక్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఎల్‌ఐసీలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, జనవరి 10: భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసిలో పరిష్కారానికి ఉద్యోగులు, జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఒక గంట పాటు సమ్మెలో పాల్గొన్నారు. కరీంనగర్ డివిజన్ కార్యాలయంలో విధులు బహిష్కరించిన ఉద్యోగులు, అధికారులు, మేనేజ్‌మెంట్ మొండి వైఖరిపై నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు చలం, ఎఐఐఈఎ డివిజన్‌ఉపాధ్యక్షుడు రాంమోహన్‌రావు, వాసు, లక్ష్మీకాంతం, వామన్‌రావు, అధికారులు, ఉద్యోగులు, వికాసాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

గణేశ్‌నగర్, జనవరి 10: బీసీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ ను కలసి వినతి పత్రం అందజేశారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుప్పటపల్లి మురళి బీసీ సంక్షేమ శాఖ , రవాణా శాఖ పొన్నం ప్రభాకర్ ను కరీంనగర్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా శాలువా కప్పి తిరుపతి ప్రసాదం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీసీ భవనం, బిసి సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ రూరల్, జనవరి 10: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థి సిహెచ్ అక్షిత్ ఎంపికయ్యారు. 67వ ఎస్‌జిఎఫ్ కరీంనగర్ జోన్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ విసరిత, ఎస్‌ఎంసి ఛైర్మన్ సుధాకర్, పిడి హరీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

కరీంనగర్ డెయిరీలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు

కరీంనగర్ అర్బన్, జనవరి 10 : కరీంనగర్ డెయిరీ ఆవరణలో బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ లక్ష పాడి రైతు కుటుంబాల సంస్థ అయిన కరీంనగర్ డెయిరీ ప్రస్తుత రెండు లక్షల లీటర్ల పాల సేకరణను 5 లక్షల లీటర్ల పాల సేకరణ చేయాలని అన్నారు. ముగ్గుల పోటీల్లో 472 మంది పాల ఉత్పత్తిదారుల పిల్లలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ప్రథమ బహుమతి పి శ్రీలత(ముత్యంపేట), ద్వితీయబహుమతి కె లహరి(మల్లంపల్లి), తృతీయ హుమతి జె రజిత(మొగిలిపాలెం), మార్కెటింగ్ విభాగంలో మొదటి బహుమతి స్వప్న(రాంనగర్), ద్వితీయ బహుమతి సౌమ్యారెడ్డి(చొప్పదండి), తృతీయ బహుమతి రజిత(మంకమ్మతోట)లు సాధించారు. విజేతలకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ఛైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, నాబార్డు డీజీఎం శ్రీహరి, ఏజీఎం స్వామి, డీడీఎం జయప్రకాశ్, ఆర్‌డీఎం కే శ్రీలత, కేడీసీసీ బ్యాంకు సీఈవో ఎం.సత్యనారాయణరావు, పద్మనగర్ బ్రాంచి మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ఇల్లందకుంట, జనవరి 10: మండలంలోని వంతడుపుల గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బుధవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిందన్నారు.

ఎంఆర్‌పీఎస్ కార్యవర్గం ఏర్పాటు

చొప్పదండి, జనవరి 10: మండలంలోని చాకుంట గ్రామానికి ఎంఆర్‌పీఎస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గ్రామ అధ్యక్షులుగా దాసరి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మల్లారపు నరేష్, ప్రధాన కార్యదర్శి పులిపాక రాజయ్య, కోశాధికారి కల్లెపెల్లి సురేష్, సభ్యులుగా జంగం కొండయ్య, దాసరి శ్రీనివాస్, కుడిదల నర్సయ్య, స్వామి, హన్మయ్య, మహేష్, రవి ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయం ఎదుట కారోబార్ నిరసన

హుజూరాబాద్‌రూరల్, జనవరి 10 : మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్న నలుబాల సందయ్య బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. 1983 నుంచి ఫుల్‌టైమ్ కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్ నుంచి పేరు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగంలోకి తీసుకోవాలని అధికారులను కోరారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

కరీంనగర్ కల్చరల్, జనవరి 10: అయోధ్య నుంచి వచ్చిన రామజన్మభూమి తీర్థ ట్రస్టు అక్షతలను బుధవారం విశ్వహిందూ పరిషత్ గోరక్షా విభాగ్ ఆధ్వర్యంలో డాక్టర్ స్ట్రీట్‌తో పాటు పలు ప్రాంతాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి ప్రాంత పూర్వ ఉపాధ్యక్షుడు డాక్టర్ జగన్మోహనరావు, శ్రీమతి, గో రక్షాప్రముఖ్ వి రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శేష శైలజ, డాక్టర్ వికాస్‌రావు, రమణారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాణినికేతన్‌లో క్యాంపస్ డ్రైవ్

గణేశ్‌నగర్, జనవరి 10: వాణి నికేతన్ ఎంబీఏ కళాశాలలో యువ ఉద్యోగార్థుల కోసం గురువారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ అనుసంధానంతో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వాణినికేతన్ విద్యాసమితి సెక్రెటరీ లక్ష్మీదీపిక తెలిపారు. యువత దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కాగలరని తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

గణేశ్‌నగర్, జనవరి10: సుభాష్ యువజన సంఘం, లక్ష్మీపూర్ నూతన క్యాలండర్-2024ను యువజన సంఘం అధ్యక్షులు చెక్కిళ్ళ సాయిరాం గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ను తెలంగాణ రాష్ట్ర రవాణా, బి.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గురువారం ఆవిష్కరించారు.

●కరీంనగర్ టౌన్: బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం కరీంనగర్ నగర అధ్యక్షులు బొంకూరి మోహన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం ఆవిష్కరించారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌లో మాజీ ప్రధానులు నెహ్రూ, రాజీవ్‌గాంధీల కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేసి, ఆ కూడళ్ళను సుందరీకరించాలని కోరుతూ యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ బుధవారం బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: తమిళనాడు రాష్ట్రంలో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి చదరంగ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన అల్ఫోర్స్ జెన్‌నెక్ట్స్ పాఠశాల విద్యార్థి టి విశాల్ పాల్గొని ప్రతిభ చాటాడు. బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అతనికి అభినందించారు.

●కరీంనగర్ రూరల్: దృఢసంకల్పం ఆత్మవిశ్వాసం విజయానికి తొలిమెట్టు అని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దనపురి సాగర్ అన్నారు. బుధవారం తీగలగుట్టపల్లి, ఆరెపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు వివేకానందుని జీవితంయువతకు ఆదర్శం అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, పోటీల్లో పాల్గొన్న వారందరికి వివేకానందుడి ప్రత్యేక సంచికను అందించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానో పాధ్యాయులు కరుణ, కళావతి పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర నాయకుడు బామండ్ల నరేందర్ తన చేతిపై కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల టాటూను వేయించుకుని వీరాభిమానాన్ని చాటాడు. బుధవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా టాటూ పట్టీని తొలగించి టాటూను ప్రదర్శించారు.

●భగత్‌నగర్: మేయర్ సునీల్‌రావు ఓ సెలెక్టెడ్ అజ్ఞాని అని ఎలెక్టెడ్ మేయర్‌లా మాట్లాడడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిలపు రమేష్ అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎవరు నామిని, ఎవరు బినామి కరీంనగర్‌ప్రజలకు తెలుసన్నారు.